సాక్షి
వైఎస్ఆర్ జిల్లా
బుధవారం । 17 । జూలై । 2024



రోడ్డు ప్రమాదంలో బావ, బావమరిది మృతి

రోడ్డు ప్రమాదంలో బావా, బావమరిది మృతి చెందిన సంఘటన పులివెందులలో మంగళ వారం చోటుచేసుకుంది. -8లో



అండర్ 19 వన్డే క్రికెట్ టోర్నీ ప్రారంభం

కడపలోని వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ మైదానం వేదికగా ఏసీఏ అండర్-19 అంతర్ జిల్లాల టోర్నీ ప్రారంభమైంది. - 8లో

గరిష్ఠం/కనిష్ఠం
35.8/24.8

వాతావరణం

జిల్లాలో మంగళవారం 24.8 - 35.8 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 6.2 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. - కడప అగ్రికల్చర్

జ్వరం.. కలవరం





ప్రొద్దుటూరు జిల్లా ఆస్పత్రిలో చిన్న పిల్లల వార్డులో చికిత్స పొందుతున్న చిన్నారులు



వాంతులు, విరేచనాలతో...

కడప నగరం అగాడి వీధికి చెందిన ఇతని పేరు సయ్యద్ బాషా. వాంతులు, విరేచనాలతో గత శుక్రవారం కడప రిమ్స్‌లో చేరాడు. అప్పటి నుంచి ఇక్కడే చికిత్స పొందుతున్నాడు. ప్రస్తుతం కొంత బాగుంది. డాక్టర్ రాసిచ్చిన మందులు లేకపోతే మందుల షాపులో కొనుక్కుని తెచ్చుకోవాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశాడు.

- ఊరూరా విష జ్వరాలే
- ఇంటింటా జ్వర పీడితులే!
- కలుషిత నీటితో విరేచనాలు, వాంతులు
- సీజనల్ వ్యాధులను అరికట్టడంలో ప్రభుత్వం ఘోర వైఫల్యం

కడప రూరల్: పల్లె మంచమెక్కింది... పట్టణం ఆస్పత్రి పాలైంది. ఏ ఊరు చూసినా.. ఏ వాడకెళ్లినా విష జ్వరాల బాధితులే కనిపిస్తున్నారు. ఎవరిని పలకరించినా తడబడుతున్న మాటే వినిపిస్తోంది. వారిలో కలవరమే కనిపిస్తోంది. జిల్లా వ్యాప్తంగా విష జ్వరాలు చుట్టుముట్టాయి. వాన తడికి చెట్లు చిగురించినట్లుగా వ్యాధులూ పుట్టుకొచ్చాయి. చిన్నా పెద్దా తేడా లేకుండా.. ఊరూ వాడా భేదం లేకుండా సీజనల్ వ్యాధులు పీడిస్తున్నాయి. అపరిశుభ్రత తోడు కావడంతో దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. అటు సీజనల్ వ్యాధులకు, ఇటు దోమల తాకిడికి జనాలు అనారోగ్యానికి గురై ఆస్పత్రుల పాలవుతున్నారు.

ఆదిలోనే సీజనల్ వ్యాధులు

ఏటా వర్షాకాలంలో సాధారణంగానే సీజనల్ వ్యాధు లు ప్రారంభమవుతాయి. అందుకనుగుణంగా ప్రభుత్వాలు, జిల్లా అధికారులు ముందస్తు చర్యలు తీసుకుంటారు. ఈసారి వర్షాలు ముందుగానే రావడంతో సీజనల్ వ్యాధులు కూడా ముందస్తు గానే జనాలపై దాడి చేయడం ప్రారంభించాయి. ప్రధానంగా 'డయేరియా' రాష్ట్రాన్నే పట్టి పీడిస్తోంది. ఈ వ్యాధి మొదట తెలంగాణలో ప్రారంభమైంది. తర్వాత ఆ వ్యాధి అన్ని ప్రాంతాలకు విస్తరించింది.

వైద్యానికి తడిసిమోపెడు ఖర్చు

జ్వరమొస్తే ఒళ్లే కాదు..ఇల్లూ గుల్లవుతోంది. సీజనల్ వ్యాధులతో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి. ఇదే అదునుగా ప్రైవేటు ఆస్పత్రులు ఫీజులు, వైద్య పరీక్షల పేరిట దందా నడిపిస్తున్నారు. ఒక వ్యక్తి జ్వరంతో వైద్యుని వద్దకు వెళితే ఫీజు కింద రూ. 300కు పైగా చెల్లించుకోవాలి. సదరు డాక్టర్ జ్వరాన్ని నిర్ధారించుకోవడానికి వైద్య పరీక్షలను చేయించుకుని రావాలని సూచిస్తున్నాడు. మలేరియా , టైఫాయిడ్ డెంగీ తదితర టెస్టులకు రూ. 1000కి పైగా అవుతుంది. ఆ నివేదికలు చూసిన వైద్యుడు డెంగీ, టైఫాయిడ్, మలేరియా ఏదీ లేదని నిర్ధారించుకున్నప్పుడు సాధారణ జ్వరానికి సంబంధించి ఒక వారం కోర్సుకు మందులను ఇస్తారు. ఎంతలేదన్నా ఈ మందులు రూ. 1000కి పైగా అవుతాయి. అంటే సాధారణ జ్వరానికే ఒక రోగి సుమారు 2వేలకు పైగా ఖర్చు చేయాలి. అదే డెంగీ, టైఫాయిడ్ అయితే ఆ ఖర్చు వేలల్లోకి చేరుకుంటుంది. ఇక డయేరియాకు సంబంధించి ఓఆర్ఎస్, జింక్ ట్యాబ్లెట్స్‌ను వాడుతారు. అలాగే నీరసాన్ని తగ్గించేందుకు ఫ్లూయిడ్స్ (ఎలక్ట్రోలైట్స్)ను ఎక్కిస్తారు. ఇందుకు కూడా డాక్టర్ ఫీజుతో కలిపి మూడు రోజులు ఆస్పత్రిలో ఉంటే ఎంత లేదన్నా రూ. 15 వేలకు పైగా ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి నెలకొంది.

ప్రభుత్వ వైఫల్యం

సాధారణంగా వానలు పడితే సీజనల్ వ్యాధులు చుట్టుముడతాయి. వ్యాధులను అరికట్టడానికి ప్రభుత్వాలు, జిల్లా అధికారులు ముందస్తు చర్యలు తీసుకుంటారు. కానీ కూటమి ప్రభుత్వం ప్రారంభంలోనే సీజనల్ వ్యాధులకు అడ్డుకట్ట వేయడంలో పూర్తిగా వైఫల్యం చెందిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామాలు, పట్టణాల్లో పరిశుభ్రత చర్యలు లోపించాయి. మురికి కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయడంలో అలసత్వం కనిపిస్తోంది. అలాగే నివాసాల మధ్య ఉండే కుంటలు, వాగుల్లో ఉన్న మురికి నీటిని తొలగించడంలో పూర్తిగా నిర్లక్ష్యం కనబడుతోంది. ఫలితంగా పరిసరాలు అపరిశుభ్రంగా మారడంతోపాటు దోమలు వీర విహారం చేస్తున్నాయి.

రోగులతో రిమ్స్ కిటకిట

కడప అర్బన్: కడప నగర శివార్లలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్)కు ఈనెల 1వ తేదీ నుంచి 16 వరకు జ్వరాలతో 249 మంది ఓపీ, ఐపీ విభాగాలలో వైద్య సేవలను పొందారు. వీరిలో డెంగీ జ్వరంతో ఒకరు చికిత్స పొందారు. చిన్నపిల్లల విభాగంలో ఇద్దరు జ్వరాలతో బాధపడి చికిత్స పొందారు. అలాగే వాంతులు, విరేచనాలు (డయేరియా)తో బాధపడుతూ 55 మంది ఓపీ, ఐపీ విభాగాలలో వైద్య సేవలను పొందారు. అలాగే ఈ వ్యాధితో బాధపడుతూ చిన్నపిల్లల విభాగంలో 49 మంది వైద్యసేవలను పొందారు. వీరికి ఐపీ విభాగంలోని జనరల్ మెడిసిన్ విభాగంలోని వార్డులలో, చిన్నపిల్లలకు పీఐసీయు విభాగంలో వైద్య సేవలను అందించారు.



రిమ్స్ జనరల్ మెడిసిన్ ఐపీ విభాగంలో వైద్య సేవలను పొందుతున్న వివిధ రకాల వ్యాధిగ్రస్తులు

జిల్లాలో చాపకింద నీరులా డయేరియా

జిల్లాలో డయేరియా చాపకింద నీరులా విస్తరించుకుంటూ పోతోంది. ఖాజీపేట మండలంలోని మిడుతూరులో డయేరియా విజృంభించింది. జిల్లా వైద్య ఆరోగ్యశాఖను ఒక కుదుపు కుదుపేసింది. ఇక్కడ 19 ఏళ్ల సునీల్ అనే యువకుడు మృత్యువాత పడటం ఆందోళన కలిగించింది.

- ఖాజీపేటలోని బాలికల హైస్కూలులో కూడా విద్యార్థులు డయేరియా బారినపడ్డారు.
- కడపలోని ఆలంఖాన్‌పల్లెలో ఒక బాలిక వాంతులతో మరణించింది.
- ప్రొద్దుటూరు జిల్లా ఆస్పత్రిలో వాంతులు లేదా విరేచనాలతో ప్రతిరోజు 20-25 మంది చికిత్స కోసం వస్తున్నారు.
- ఇలా ప్రతి ప్రాంతంలో చాలా వరకు ప్రజలు విరేచనాలు, వాంతులతో సమీపంలోని ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారు.
- ఇక వైరల్ ఫీవర్లు సర్వసాధారణంగా మారిపోయాయి. ఈ వైరల్ ఫీవర్ సాధారణంగా ఏడు రోజుల వరకు ఉంటుంది. ఈ జ్వరం మనుషులను పట్టి పీడిస్తుంది. సాధారణంగా ఆస్పత్రులకు షుగర్, బీపీ వ్యాధులకు ఎక్కువ సంఖ్యలో వెళుతుంటారు. అయితే ఈ సీజనల్ వ్యాధుల కాలంలో విరేచనాలు, వాంతులు, వైరల్ ఫీవర్లతో ఆస్పత్రులకు వెళ్లే వారి సంఖ్య ఎక్కువైంది. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాలలో సీజనల్ వ్యాధులకు సంబంధించి ఏదో ఒక జబ్బుతో బాధపడుతున్నారు..మంచాన పట్టి ఉన్నారు.

ఇతర వ్యాధులు కూడా...



డెంగీ జ్వరాలు కూడా నేనున్నానంటూ పలుకరిస్తున్నాయి. ఇది పగటిపూట కుట్టే టైగర్ దోమ వల్ల ఈ జ్వరాలు వస్తుంటాయి. దీనికి చికిత్స కూడా కాస్త ఖరీదైనదే. అలాగే జలుబు, దగ్గు, సాధారణ జ్వరాలు కూడా ప్రబలుతున్నాయి.

నీటి కాలుష్యానికి అడ్డుకట్ట ఏదీ!

ఖాజీపేట: జిల్లాలోని సీజనల్ వ్యాధులకు ప్రధాన కారణం నీటి కాలుష్యమే. ప్రభుత్వ నిర్లక్ష్యం.. అధికారుల అలసత్వం వల్ల నీటి కాలుష్యానికి అడ్డకట్ట వేసే చర్యలే లేవు. జిల్లాలో చాలా ప్రాంతాల్లో కలుషిత నీటి సరఫరా జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ముఖ్యంగా ఖాజీపేట మండలంలో సుమారు 51 గ్రామాలకు ములపాక నుంచి నీరు సరఫరా అవుతోంది. ఈ ట్యాంకు నుంచి వచ్చే నీరే అందరూ తాగునీరుగా వాడుతున్నారు. నీటి ట్యాంకుల నుంచి వచ్చే పైప్‌లైన్ డ్యామేజీ కారణంగా కలుషిత నీరు అందులోకి పోయి నీరు పూర్తిగా కలుషితం అవుతోంది. ఈ నీటిని తాగే మిడుతూరులో అధికమంది డయేరియా బారిన పడ్డారు.

వైద్య సేవలూ అంతంతే...

ఇక ఖాజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యుల నిర్లక్ష్యం పై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఇక్కడి వైద్యులు సక్రమంగా విధులు నిర్వహించక పోవడం వల్ల చాలా మంది ప్రైవేటు ఆస్పత్రులకు పరుగులు పెడుతున్నారు. ఇక గ్రామీణ ప్రాంతాల్లో వైద్యం అందించాలన్న లక్ష్యంగా ఏర్పాటు చేసిన 104లోనూ వైద్యులు కనిపించడం లేదని స్థానికులు అంటున్నారు. ఖాజీ పేట ప్రాథమిక రోగ్య కేంద్రంలో ఇద్దరు వైద్యులు ఉన్నారు. ఒకరు పీహెచ్‌సీలో ఉంటే మరోకరు 104 ద్వారా గ్రామాలకు వెళ్లాలి. కానీ 104 సిబ్బంది వైద్య సేవలు అందిస్తున్నారు.



తుడుములదిన్నె ప్రధాన వీధిలో నిలిచిన నీరు

అదుపులోకి రాలేదు



నా భర్తతో పాటు మా తోడికోడలు మూడు రోజులుగా వాంతులు, విరేచనాలతో బాధపడుతున్నారు. ప్రభుత్వాసుపత్రికి వచ్చి చికిత్స చేయించుకుంటున్నారు. ఇంకా అదుపులోకి రాలేదు. గ్రామంలో పారిశుద్ధ్యం లోపించడంతో పాటు దోమలు అధికంగా ఉన్నాయి. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

– స్వాతి, పల్లెరవారిపల్లె, బద్వేలు

తీవ్రంగా ఇబ్బంది పడ్డాను



వాంతులు, విరేచనాలు అధికమై తీవ్ర ఇబ్బందులు పడ్డాను. శుక్రవారం కడప రిమ్స్‌లో చేరాను. నాలుగు రోజులు అక్కడే చికిత్స పొంది మంగళవారం ఇంటికి వచ్చాను. అయినా ఇంకా నీరసంగా ఉంది.

– రామాంజనేయులు, దళితవాడ, తుడుమలదిన్నె, ఖాజీపేట మండలం

మూడు రోజులుగా చికిత్స చేయించుకుంటున్నా



వాంతులు, విరేచనాలతో నాలుగు రోజుల క్రితం ఆస్పత్రిలో చేరాను. విరేచనాలతో పూర్తిగా నీరసించి పోయాను. ఆరోగ్యం కూడా బాగా క్షీణించింది. సెలైన్ బాటిళ్లతో పాటు ఇతర మందులు తీసుకోవడంతో ఇప్పుడు కొంత వరకు ఆరోగ్యం మెరుగు పడింది. రెండు రోజుల్లో పూర్తిగా కోలుకుంటానని వైద్యులు చెప్పారు.

– గంగమ్మ, గుడిపాడు, దువ్వూరు మండలం

వైద్యసేవలు, మందులను అందిస్తున్నాం



సీజనల్‌గా ప్రారంభమైన అన్ని రకాల జ్వరాలకు, విరేచనాలకు సంబంధించిన వైద్య సేవలను రిమ్స్‌లో అందిస్తున్నాం. మందులు అన్ని రకాలుగా అందుబాటులో ఉన్నాయి. జ్వరాలతో బాధపడే పెద్దలకు మాత్రమే కాకుండా చిన్న పిల్లలకు ప్రత్యేకంగా వారికి సంబంధించిన వార్డులలోనే వైద్య సేవలను అందిస్తున్నాం.

– డాక్టర్ వై. శ్రీనివాసులు, సీఎస్ఆర్ఎంఓ, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్),కడప

అప్రమత్తంగా ఉన్నాం



సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉన్నాం. ఇప్పటికే డయేరియాపై అవగాహన కార్యక్రమాలను చేపట్టాం. పారిశుధ్య అంశాలకు సంబంధించి చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖలకు సూచించాం .సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్యాధికారులకు ఆదేశాలు జారీ చేశాం. అపరిశుభ్రత, కలుషిత నీరు కారణంగా డయేరియా రావడానికి అవకాశం ఉంటుంది. వాతావరణంలో మార్పుల నేపథ్యంలో వైరల్ ఫీవర్లు కూడా వస్తుంటాయి. అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా వైద్య సేవలను పొందవచ్చు.

– డాక్టర్ నాగరాజు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి, కడప

న్యూస్‌రీల్

దోమకాటు వ్యాధులపై అవగాహన



మాట్లాడుతున్న జిల్లా మలేరియా అధికారిణి మనోరమ

వేంపల్లె: దోమకాటు ద్వారా వచ్చే మలేరియా, డెంగ్యూ, చికున్ గున్యా వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా మలేరియా అధికారిణి మనోరమ ఆదేశించారు. మంగళవారం మండలంలోని తాళ్లపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య సిబ్బందికి ఆమె పలు సలహాలు చేశారు. శుక్రవారం నుంచి ఆదివారం వరకు డ్రైడే తప్పనిసరిగా నిర్వహించాలని సూచించారు. సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య, ఎంపీహెచ్ఈఓలు శంకర్‌రెడ్డి, బాబా ఫకృద్దీన్, సీహెచ్ఓ వెంకటరత్నం పాల్గొన్నారు.

19న డీవైఎఫ్ఐ జిల్లా వర్క్‌షాప్



కరపత్రాలు విడుదల చేస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

ప్రొద్దుటూరు: బద్వేలులో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈనెల 19న నిర్వహించనున్న జిల్లా వర్క్‌షాప్‌ను జయప్రదం చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ తెలిపారు. మంగళవారం ప్రొద్దుటూరులో వర్క్‌షాప్‌కు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేక హోదా, ఉక్కు పరిశ్రమ, రాయలసీమకు బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీ ఇవ్వడంలో కేంద్రం జాప్యం చేస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడితెచ్చి వీటిని సాధించాలని తెలిపారు. బద్వేలులో 19న జరిగే వర్క్‌షాప్‌లో యువత పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు డేవిడ్, విశ్వనాథ్, వెంకటేష్, రమేష్ పాల్గొన్నారు.

సింహ వాహనంపై సౌమ్యనాథుడు



గ్రామోత్సవంలో సింహవాహనంపై సౌమ్యనాథుడు

నందలూరు: నందలూరు సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా నాలుగో రోజు మంగళవారం సింహవాహనంపై స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ఉత్సవ మూర్తులకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పల్లకీలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీ సౌమ్యనాథస్వామి మాఢ వీధులలో ఊరేగారు. రాత్రి సౌమ్యనాథస్వామి సింహవాహనంపై నరసింహస్వామి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు స్వామివారిని దర్శించుకొని గోవింద నామస్మరణలతో ఊరేగింపు వెంట కదిలివచ్చారు.

బ్రహ్మోత్సవాలలో నేడు: బ్రహ్మోత్సవాలలో భాగంగా ఐదో రోజు బుధవారం ఉదయం పల్లకీ సేవ, తిరుమంజనం, రాత్రి హనుమంత వాహనంపై స్వామివారు భక్తులకు దర్శనమివ్వనున్నట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్ కుమార్ తెలిపారు.

మట్టి తరలించాలంటే కప్పం కట్టాల్సిందే

చింతకొమ్మదిన్నె మండలంలో టీడీపీ నాయకుల ఆగడాలు

చింతకొమ్మదిన్నె: మండలంలో రోజురోజుకూ టీడీపీ నాయకుల ఆగడాలు, ఆక్రమాలు అధికమయ్యాయి. అందుకే చింతకొమ్మదిన్నె చెరువు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఒక టీడీపీ నాయకుడు ఐదు రోజుల నుంచి ఆక్రమంగా హిటాచిని ఏర్పాటు చేసి రోజుకు వందల సంఖ్యలో టిప్పర్ల ద్వారా అక్రమంగా మట్టిని తరలిస్తున్నాడు. ఈ విషయమై స్థానికులు రెవెన్యూ అధికారులకు, ఇరిగేషన్ సిబ్బందికి సమాచారం అందించినప్పటికీ పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అక్రమంగా తరలిస్తున్న మట్టి తవ్వకాలను ఆపాలని ప్రజలు కోరుతున్నారు.

ట్రిప్పుకు రూ.2వేలు అక్రమంగా వసూలు

కడప-రాయచోటి ప్రధాన రహదారిలో గల ఎన్‌టీపీసీ సమీపంలోని పిచ్చమ్మ గుట్ట నుంచి అన్ని రకాల అనుమతులతో గ్రావెల్ తోలుకుంటున్న ఒక్కొక్క వాహనానికి 2000 పైచిలుకు రూపాయలను టీడీపీ నాయకులు అక్రమంగా వసూలు చేసి తమ జేబులో నింపుకుంటున్నారని వాహనదారులు వాపోతున్నారు. ఇదేమిటని ప్రశ్నించిన వాహనదారులపై దాడులకు దిగడం లేదా టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి అనుమతులు తీసుకోవాలని హెచ్చరిస్తున్నట్లు వాహన యజమానులు తెలుపుతున్నారు. టీడీపీ నాయకుల వాహనాలైతే ఎటువంటి అనుమతి అవసరం లేదని, డబ్బు చెల్లించాల్సిన అవసరం లేదని సమాచారం.



టీడీపీ నాయకులు చింతకొమ్మదిన్నె చెరువు నుంచి అక్రమంగా తరలిస్తున్న మట్టి టిప్పర్

యథేచ్ఛగా ఆక్రమణలు

చెర్లోపల్లిలో ప్రభుత్వ స్థలాలను టీడీపీ నాయకులు కబ్జా చేసి దొంగ పత్రాలను సృష్టించి వాటిని పలువురికి విక్రయించారు. సదరు విషయమై గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మండల సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు అందరూ తీర్మానం చేసి కబ్జాకు గురైన స్థలాలను కాపాడాలని కడప మున్సిపల్ కమిషనర్‌తో పాటు కలెక్టర్‌కు తీర్మాన పత్రాలను అందించినప్పటికీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఇదిలా ఉండగా ప్రస్తుత ప్రభుత్వంలో ఉన్న మండల నాయకులు వైఎస్ఆర్ సీపీ నాయకులే అక్రమాలకు పాల్పడ్డారని చెప్పడంతో ప్రజలు టీడీపీ నాయకులపై ఆగ్రహం వెళ్లగక్కుతున్నారు. మరోవైపు వైఎస్ఆర్ సీపీ నాయకులు తాము ఎక్కడైనా ప్రభుత్వ స్థలాలను కబ్జా చేస్తుంటే వాటిని స్వాధీనం చేసుకోవాలని చెప్పడమే కాకుండా పార్టీలకతీతంగా ఎవరు కబ్జా చేసినా ప్రభుత్వం వాటిని స్వాధీనం చేసుకొని పేద ప్రజలకు పంచి పెట్టాలని కోరుతున్నారు.

పోలీసు సిబ్బంది సహకారం మరువలేను



పరేడ్‌ను పరిశీలించి, గౌరవవందనం స్వీకరిస్తున్న ఎస్పీ సిద్దార్థ్ కౌశల్



ఎస్పీ సిద్దార్థ్ కౌశల్‌ను సన్మానిస్తున్న పోలీస్ అధికారులు

- సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో జిల్లాకు ప్రత్యేక స్థానం
- జిల్లా పోలీసుల ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమంలో ఎస్పీ సిద్దార్థ్ కౌశల్

కడప అర్బన్: విధి నిర్వహణలో పోలీసు సిబ్బంది సహకారం మరువలేనని బదిలీపై వెళ్తున్న ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ అన్నారు. ముఖ్యంగా సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా జరిగేందుకు పోలీస్ సిబ్బంది సమిష్టిగా విధులు నిర్వహించారని పేర్కొన్నారు. మంగళవారం కడపలోని స్థానిక పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు యంత్రాంగం నుంచి గౌరవ వందనం స్వీకరించిన అనంతరం పరేడ్ పరిశీలన చేశారు. అనంతరం మాట్లాడుతూ జిల్లాలో తాను బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి హోంగార్డు స్థాయి నుంచి ఉన్నతాధికారుల వరకు తనకు సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. అలాగే ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా వారికి జిల్లా ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) లోసారి సుధాకర్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అదనపు ఎస్పీ వెంకట్రాముడు మాట్లాడుతూ ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ తనదైన శైలిలో జిల్లాలో శాంతి భద్రతలను పరిరక్షించి ప్రజల మన్ననలు పొందారన్నారు. ఏఆర్ అదనపు ఎస్పీ ఎస్.ఎస్.ఎస్.వి కృష్ణారావు మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో ఎన్నికల విధుల సమయంలో, సమస్యాత్మక విషయాలను పరిష్కరించే విధానం ఎస్పీ గొప్ప లక్షణమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కొత్త ఎస్పీ బాధ్యతల స్వీకరణ



జిల్లా ఎస్పీగా నియమితులైన హర్షవర్ధన్ రాజు

కడప అర్బన్: జిల్లా నూతన ఎస్పీగా హర్షవర్ధన్ రాజు బుధవారం ఉదయం 11 గంటలకు కడపలోని జిల్లా పోలీసు కార్యాలయంలో బాధ్యతలను స్వీకరించనున్నారు. మూడు రోజుల క్రితం రాష్ట్ర వ్యాప్తంగా పలువురు ఐపీఎస్ అధికారులను బదిలీ చేశారు. ఈక్రమంలో జిల్లా ఎస్పీగా పనిచేసిన సిద్ధార్థ్ కౌశల్‌ను డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేసుకోవాలనీ ఆదేశించారు. తిరుపతి జిల్లా ఎస్పీగా పనిచేస్తున్న హర్షవర్ధన్ రాజు వైఎస్సార్ జిల్లాకు ఎస్పీగా నియమించారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

కడప ఎడ్యుకేషన్: జాతీయ ఉపాధ్యాయ అవార్డు-2024కు అర్హత గల ఉపాధ్యాయులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 21వ తేదీ వరకు గడువును పొడిగించినట్లు డీఈఓ మర్రెడ్డి అనురాధ తెలిపారు. జిల్లాలో పని చేస్తున్న అర్హత, ఆసక్తి గల ఉపాధ్యాయులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అర్హత గల ఉపాధ్యాయులు ఆన్‌లైన్ ద్వారా తమ దరఖాస్తులను నిర్ణీత సమయం లోపల సమర్పించాలని తెలిపారు. అర్హతలు, సమాచారం కోసం http:// nationalwardstoteacher.education.gov.in సంప్రదించాలని డీఈఓ అనురాధ తెలిపారు.

క్లుప్తంగా

చెన్నారెడ్డి కాలనీలో చోరీ

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణంలోని ముద్దనూరు రోడ్డు చెన్నారెడ్డి కాలనీలో నివాసముంటున్న ఉపాధ్యాయుడు విశ్వనాథ రెడ్డి ఇంట్లో దొంగలు చొరబడి నగలు, నగదు దోచుకెళ్లారు. దొంగలుపడ్డారు. పనుల నిమిత్తం సోమవారం విశ్వనాథరెడ్డి కడపకు వెళ్లారు. ఇంట్లో ఎవరూలేని సమయం చూసి దొంగలు ఇంటి తలుపులకు తాళాలు పగలగొట్టి లోపలకు చొరబడ్డారు. పది తులాల బంగారు, నగదు తీసుకెళ్లినట్లు బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తుల మృతి


మద్యం తాగి మృతిచెందిన వ్యక్తి

గోపవరం : మండలంలోని శ్రీనివాసపురం సమీపంలో నెల్లూరు–ముంబై జాతీయ రహదారిపై మంగళవారం ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు మృతి చెందారు. సుమారు 60 ఏళ్ల వయస్సు కలిగిన వ్యక్తిని గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందారు. అదే వయస్సు కలిగిన మరో వ్యక్తి రోడ్డు పక్కనే మృతిచెందాడు. స్థానికుల సమాచారం మేరకు బద్వేలు రూరల్ ఎస్ఐ రవికుమార్, సిబ్బంది చేరుకుని మృతదేహాలను పరిశీలించారు. వ్యక్తులకు సంబంధించి ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో మృతదేహాలను బద్వేల్ ఆసుపత్రికి తరలించారు.

ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలు

చింతకొమ్మదిన్నె : కడప–పులివెందుల రహదారిలో ద్విచక్ర వాహనాన్ని టెంపో వాహనం ఢీకొన్న ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు.. పెండ్లిమర్రి మండలం మాచనూరు గ్రామానికి చెందిన వెంకటస్వామి కడప నగరంలో సొంత పనులు ముగించుకొని ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తున్నారు. సాక్షి యూనిట్ కార్యాలయం దాటగానే వెనుక వైపు నుంచి సూపర్–కె మార్కెట్ సామగ్రి తీసుకెళ్తున్న టెంపో వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో వెంకటస్వామికి రెండు కాళ్లు విరిగాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


గాయపడిన వెంకటస్వామి

ఐపీ పెట్టిన వ్యాపారి

జమ్మలమడుగు రూరల్ : పట్టణంలోని మార్కెట్ బజార్ ప్రధాన రహదారిలో జనరల్ స్టోర్ నిర్వహిస్తున్న ఓ వ్యాపారి రూ.4 కోట్ల రూపాయల మేర ఐపీ పెట్టి కనిపించకుండా పోయినట్లు తెలిసింది. గత పదేళ్లుగా జమ్మలమడుగు, ప్రొద్దుటూరు ప్రాంతాల వ్యాపారులతో సన్నిహితంగా ఉండడంతో ఆ వ్యాపారికి తమ వస్తువులను సరఫరా చేస్తూ వచ్చారు. నెల రోజుల నుంచి జనరల్ స్టోర్ మూతపడి ఉండడం, ఫోన్ చేసినా స్పందించకపోవడంతో సరకు ఇచ్చిన వ్యాపారులు ఆందోళనకు గురవుతున్నారు. ఎదరు వ్యాపారి ఇప్పటికే కొంత మందికి ఐపీ తాఖీదులు పంపడంతో వ్యాపారులంతా స్థానిక రాజకీయ పెద్దలను ఆశ్రయించారు. అయితే ఇలాంటి పంచాయతీలు తాము చేయలేమని చెప్పినట్లు సమాచారం.

రిమ్స్ అధికారులూ...!
మా గోడు వినండి..!!


రిమ్స్ ఓపిలో నేలపైన కూర్చుని సేద తీరుతున్న రోగులు, వారి సహాయకులు (ఇన్‌సెట్) ఐపీలో మూసేసిన పురుషుల, మహిళల మరుగుదొడ్లు

- నేలపైనే సేదతీరుతున్న రోగులు
- కొన్ని వార్డుల్లో మరుగుదొడ్లకు తాళాలు
- నాలుగు రోజుల్లో సెల్‌ఫోన్లు, మోటార్‌సైకిల్ చోరీ

కడప అర్బన్ : కడప నగర శివారులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి(రిమ్స్)లో రోగుల కష్టాలు అన్నీ ఇన్నీ కావు. వారికి కల్పించిన కనీస సౌకర్యాలకు కళ్లెం వేస్తున్న పరిస్థితి. ఓపీ, ఐపీ విభాగాల్లో వైద్య సేవలు పొందేందుకు జిల్లా నలుమూలల నుంచి వేలాది రోగులు, వారి సహాయకులు ఆస్పత్రికి వస్తారు. వీరికి సౌకర్యాలు కల్పించడంలో అధికారుల తీరు రోగులకు సంకటంగా మారింది. కొన్నిచోట్ల పురుషులు, మహిళల మరుగుదొడ్లకు తాళాలు వేశారు. ఐపీ విభాగంలోని లిఫ్ట్ పనిచేయకపోవడంతో రోగులను వైద్య పరీక్షలకు తీసుకువెళ్లాలంటే రోగులు ఇబ్బంది పడుతున్నారు. వారి సహాయకులు వార్డుల కారిడార్‌లో నిద్రించాల్సి వస్తోంది. నాలుగు రోజుల్లోనే కొందరు సిబ్బంది తీరుతో ఐదు సెల్‌ఫోన్లు, ఒక మోటార్ సైకిల్ చోరీకి గురయ్యాయి. రోజు రోజుకూ ఓపీ, ఐపీ సేవలు పెరుగుతున్నా.. అందుకు అనుగుణంగా సెక్యూరిటీ, వైద్య సిబ్బందిని పెంచడంలేదు. ఐపీ విభాగానికి ముందుభాగాన ఏర్పాటు చేసిన విశ్రాంతి భవనాన్ని అందుబాటులోకి తీసుకువస్తే బాగుంటుందని రోగుల సహాయకులు కోరుతున్నారు. పోషకాహారంలో కూడా నాణ్యతాలోపం ఉందని, తక్కువ మోతాదులో ఇస్తున్నారని ఆవేదన చెందుతున్నారు.

ప్రాణం తీసిన ఇసుక అక్రమ రవాణా

ప్రొద్దుటూరు క్రైం : ఇసుక అక్రమ రవాణా ఓ యువకుణ్ణి బలి తీసుకుంది. ఇసుకను నింపుకొనేందుకు ట్రాక్టర్‌తో పెన్నా నదిలోకి వెళ్లిన కమటం పెద్దయ్య (24) వేగంగా తోలుతూ ట్రాక్టర్ బోల్తా పడి అక్కడిక్కడే దుర్మరణం చెందాడు. వివరాల్లోకి వెళితే.. ప్రొద్దుటూరులో ఇసుక రీచ్ లేదు. అయినా పెన్నా నదిలో ఇసుకను అక్రమార్కులు తోడేస్తున్నారు. రాత్రి పగలు అనే తేడా లేకుండా ట్రాక్టర్లు, టిప్పర్లతో అక్రమ రవాణా చేస్తున్నారు. ఇసుక అక్రమ రవాణా విషయమై కొందరు వ్యక్తుల మధ్య సోమవారం మధ్యాహ్నం ఘర్షణ జరిగింది. ఆ సమయంలో నంద్యాల జిల్లా చాగలమర్రి మండలం గొట్లూరుకు చెందిన కమటం పెద్దయ్య కూడా ఇసుకను కోసం పెన్నా నదిలోకి ట్రాక్టర్ నడుపుకుంటూ వెళ్లాడు. రామాపురం సమీపంలో పెన్నా నదిలోకి స్పీడ్‌గా వెళ్లే క్రమంలో ట్రాక్టర్ అదుపు తప్పి పక్కనే ఉన్న పొలాల్లోకి బోల్తా పడింది. పెద్దయ్య ట్రాక్టర్ ఇంజన్ కింద చిక్కుకుని అక్కడిక్కడే మృతి చెందాడు. పెద్దయ్య కూలి పని చేసుకుని జీవిస్తున్నాడు. ట్రాక్టర్ డ్రైవర్ అందుబాటులో లేకపోవడంతో పెద్దయ్య వెళ్లినట్టు అతడి తల్లి కుమారి తెలిపింది. మరో రెండు నెలల్లో కుమారుడి పెళ్లి చేయాలని భావించామని, ఇంతలోనే ఈ దుర్ఘటన జరిగిందని వాపోయింది. పెద్దయ్య తండ్రి చంద్ర ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ట్రాక్టర్ బోల్తా పడి యువకుడి మృతి


మృతి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ పెద్దయ్య


పొలాల్లో పడిపోయిన ట్రాక్టర్


విషాదంలో పెద్దయ్య తల్లి కుమారి

ఆంధ్ర జట్టు గోల్ కీపర్‌గా తేజేంద్ర



వేంపల్లె : జాతీయ స్థాయిలో జరిగే ఫ్లోర్ బాల్ పోటీలకు ఆంధ్ర జట్టు తరపున గోల్‌కీపర్‌గా రాచవీటి తేజేంద్ర ఎంపికైనట్లు ఆంధ్ర ప్రదేశ్ ఫ్లోర్‌బాల్ అసోషియేషన్ కార్యదర్శి జోషినాథ్ వెల్లడించారు. ఈ నెల 18, 19, 20వ తేదీల్లో హర్యానా రాష్ట్రంలో జరిగే జాతీయ స్థాయి ఫ్లోర్ బాల్ పోటీల్లో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ తేజేంద్ర పాల్గొననున్నట్లు తెలిపారు.

బొలెరో వాహనం బోల్తా


బోల్తాపడిన బొలెరో వాహనం

పోరుమామిళ్ల (అట్లూరు) : పోరుమామిళ్ల మండల పరిధిలో మంగళవారం బొలెరో వాహనం బోల్తాపడిన ఘటనలో పెను ప్రమాదం తప్పింది. స్థానికుల వివరాల మేరకు.. తిరుపతి నుండి ఇంటి సామగ్రితో పోరుమామిళ్లకు వస్తున్న బొలెరో వాహనం నరసింగపల్లె వద్దకు వచ్చే సమయానికి టైరు పగిలి బోల్తాపడింది. ఈ ఘటనలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయని, అయితే ఆ సమయానికి వాహనాల రాకపోకలు లేకపోవడంతో ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు.

ఫుడ్ అండ్ సైన్స్ టెక్నాలజీతో
మెరుగైన అవకాశాలు

పులివెందుల టౌన్ : ఫుడ్ అండ్ సైన్స్ టెక్నాలజీతో మెరుగైన ఉద్యోగావకాశాలున్నాయని కళాశాల అసోసియేట్ డీన్ డా.ఎంఎస్.బేగ్ అన్నారు. పులివెందుల ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఫుడ్ అండ్ సైన్స్ టెక్నాలజీ కళాశాలలో డిగ్రీ అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతోందన్నారు. ఈ కోర్సులో చేరుటకు ఆచార్య ఎన్జీరంగ వ్యవసాయ విశ్వవిద్యాలయం ద్వారా బైపీసీ ఫార్మస్ కోటా, నాన్ ఫార్మస్ కోటా విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా ఆగస్టు 2వతేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. లేట్ ఫీజుతో ఆగస్టు 12వతేదీ వరకూ దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు. ఎంపీసీ విద్యార్థులకు ఫార్మస్ కోటాలో ఈ నెల 29వ తేదీ వరకు ఆఫ్‌లైన్ ద్వారా అడ్మిషన్లు ఉంటాయన్నారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు anfrau.ac.in పొందవచ్చునని పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ ఎంపీసీ, బైపీసీ పూర్తి చేసి ఏపీ–ఈఏపీసీఈటీలో ర్యాంకు సాధించిన విద్యార్థులు వెబ్ ఆప్షన్ ద్వారా కళాశాల ఎంపిక చేసుకోవాలని సూచించారు. పులివెందుల ఫుడ్ టెక్నాలజీ కోర్సు అభ్యసించిన వారికి ఆహార అనుబంధ రంగాల్లో అపార అవకాశాలున్నాయన్నారు. విద్య పూర్తయ్యాక దేశ విదేశాల్లో అధ్యాపకులుగా స్థిరపడుతున్నారన్నారు. కళాశాలలో బీటెక్ 4 సంవత్సరాల డిగ్రీ కోర్సు అందుబాటులో ఉందన్నారు. మరిన్ని వివరాల కోసం ఆచార్య ఎన్జీరంగ వ్యవసాయ విశ్వవిద్యాలయ వెబ్‌సైట్ చూడాలని సూచించారు. మరిన్ని వివరాలకు పులివెందుల కాలేజీ ఆఫ్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల అసోషియేట్ డీన్ 9177776692ను సంప్రదించి వివరాలు తెలుసుకోవచ్చన్నారు.


కళాశాల అసోసియేట్ డీన్ డా.ఎం ఎస్ బేగ్

రోడ్డు ప్రమాదంలో బావ, బావమరిది మృతి


మృతి చెందిన కిట్టయ్య, కృష్ణయ్య

పులివెందుల రూరల్ : కుమారుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా.. అతడికి భోజనం తీసుకెళ్తున్న తండ్రి, ఆయన బావమరిది రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సంఘటన పులివెందులలో మంగళ వారం చోటుచేసుకుంది. మృతుడి బంధువుల వివరాల మేరకు... లింగాల మండలం లోపట్నూతల గ్రామానికి చెందిన కృష్ణయ్య కుమారుడు అమరేష్‌ను మంగళవారం విష పురుగు కుట్టడంతో చికిత్స కోసం పులివెందుల ఆస్పత్రికి తరలించారు. కుమారుడు చికిత్స పొందుతుండడంతో అతడికి తోడుగా ఆస్పత్రిలో ఉన్న వారికి భోజనం తెచ్చేందుకు రాత్రి ఎనిమిది గంటల ప్రాంతంలో కృష్ణయ్య(54)తోపాటు సింహాద్రిపురం మండలం బలపనూరు గ్రామానికి చెందిన ఆయన బావమరిది కిట్టయ్య(49) ద్విచక్ర వాహనంలో పులివెందులకు వచ్చారు. భోజనం తీసుకుని కడప రోడ్డులోని ఆస్పత్రి ముందుకు రాగానే నేషనల్ హైవే పనులు చేస్తున్న క్యాంపర్ వేగంగా వచ్చి వీరి ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. దీంతో ఇరువురూ అక్కడికక్కడే మృతిచెందారు. విషయం తెలుసుకున్న కుమారుడు, భార్యతో బంధువులు బోరున విలపించారు. సర్వజన ఆస్పత్రి ముందే ప్రమాదం జరిగినా.. అక్కడి వైద్యులు, సిబ్బంది స్పందించలేదు. ఆస్పత్రి పోలీసులు అటువైపు రాలేదని మృతుల బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు. పులివెందుల–కడప రహదారి ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి ఎదుట ఎలాంటి స్పీడ్ బ్రేకర్లు లేవని, దానికి తోడు లైట్లు లేకపోవడంతోనే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. ఇలాంటి సంఘటనలు జరగకుండా లైట్లు, స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

నిరుద్యోగ భృతిపై విధి విధానాలు ప్రకటించాలి

కడప సెవెన్‌రోడ్స్ : నిరుద్యోగ భృతిపై విధి విధానాలు ప్రకటించకపోవడం దారుణమని ఆల్ ఇండియా యూత్ లీగ్ రాయలసీమ ఇన్‌ఛార్జి ఓబయ్య, ఉపాధ్యక్షుడు హరికృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. కడప నగరంలో విలేకరులతో వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవడంలో విఫలమైందన్నారు. ఉద్యోగావకాశాలు లేక నిరుద్యోగుల సంఖ్య పెరిగిపోతోందని, యువకులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వార్షిక ఆదాయం అంటూ కుంటి సాకులు చూపకుండా, ప్రతి నిరుద్యోగికి భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

భూ ఆక్రమణదారులపై చర్యలు


నల్లాయపల్లె రెవెన్యూ పొలాలను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి ఆర్డీఓ చంద్రమోహన్

అట్లూరు : భూ ఆక్రమణదారులను గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బద్వేల్ ఇన్‌చార్జి ఆర్డీఓ చంద్రమోహన్ సూచించారు. మండలంలోని నల్లాయపల్లె రెవెన్యూ పొలంలో ప్రభుత్వ భూమిని ఆక్రమించి యంత్రాలతో చదును చేస్తున్నారనే సమాచారంతో స్పందించిన ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమి కేటాయించినట్లు ఆధారాలున్న వారికి అవకాశం కల్పించి, మిగిలిన ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని అట్లూరు తహసీల్దారు వేణుగోపాల్, అట్లూరు ఎస్ఐ కె.సి.రాజులను ఆదేశించారు. సర్వే నెంబర్ 1 నుంచి చివరి నెంబర్ వరకు సర్వే బృందాలను ఏర్పాటు చేసి సమగ్ర నివేదిక తయారు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప తహసీల్దారు రవిశంకర్, డీఐ నాయుడు, వీఆర్ఓలు, వీఆర్ఏలు తదితరులు పాల్గొన్నారు.

ఎర్రచందనం స్మగ్లర్ అరెస్ట్

కడప అర్బన్ : అటవీ ప్రాంతం నుంచి దుంగలు తరలిస్తున్న స్మగ్లర్‌ను అటవీ అధికారులు మంగళవారం అరెస్టు చేశారు. ఏడు ఎర్ర చందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. కడప ఫ్లయింగ్ స్క్వాడ్ విభాగం డీఎఫ్ఓ గురు ప్రభాకర్‌కు ఆదేశాల మేరకు ఫ్లయింగ్ స్క్వాడ్ పార్టీ కడప ఎఫ్ఆర్ఓ నయీం ఆలీ, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ నాగరాజు, సిబ్బంది ఖాజ రహమతుల్లా, శోభారాణి, బాల చెన్నయ్య, వెంకటేష్‌ల బృందం లంకమల్ల రిజర్వ్ అటవీప్రాంతంలో నిఘా వేశారు. ఎర్రచందనం దుంగలు తరలిస్తున్న ఖాజీపేట మండలం నాగసాని పల్లికి చెందిన పెరుగు కొండయ్యను అరెస్టు చేశారు. మరో ముగ్గురు వ్యక్తులు తప్పించుకుని పరారవగా, వారి కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు డీఎఫ్ఓ గురు ప్రభాకర్ తెలిపారు.


నిందితుడు, స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం దుంగలతో అటవీశాఖ అధికారులు, సిబ్బంది

టీడీపీ ప్రభుత్వంలోనే దళితులపై దాడులు

వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వినోద్

కడప కార్పొరేషన్ : తెలుగుదేశం పార్టీ ఎప్పుడు అధికారం చేపట్టినా దళితులపై దాడులు జరగడం పరిపాటిగా మారిందని వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు సిహెచ్ వినోద్‌కుమార్ అన్నారు. రిమ్స్‌లో చికిత్స పొందుతున్న పెన్న పేరూరు గ్రామస్థుడు కదిరి ప్రభాకర్‌ను మంగళవారం ఆయన పరామర్శించారు. వినోద్ కుమార్ మాట్లాడుతూ గజ్జల వెంకట సుబ్బారెడ్డి కులం పేరుతో దూషిస్తూ వేడినూనె ఒంటిపై పోయడం మానవత్వానికి మాయని మచ్చ అన్నారు. ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్న ప్రభాకర్‌ను అధికార టీడీపీ నాయకులు పరామర్శించకపోవడం విచారకరమన్నారు. బాధిత కుటుంబానికి రూ.20 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు చెన్నయ్య, కె.బాబు, డివిజన్ ఇన్‌చార్జులు బండి ప్రసాద్, త్యాగరాజు, కంచుపాటి బాబు పాల్గొన్నారు.


ప్రభాకర్‌ను పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు సీహెచ్ వినోద్, కార్పొరేటర్లు

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిశీలన


రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ నాగరాజు

అట్లూరు : అట్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.నాగరాజు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో రికార్డులు, ల్యాబ్‌ను పరిశీలించారు. డాక్టర్ మాధురి ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొని దోమల ద్వారా వచ్చే వ్యాధుల గురించి ప్రజలకు వివరించారు. ఆయన మాట్లాడుతూ ఆసుపత్రిలో గర్భిణులకు పరీక్ష, చికిత్స విధానం, డెలివరీలను మెరుగుపరచాలని కోరారు. అనంతరం కుష్టువ్యాధి గురించి గ్రామాల్లో పర్యటించి ఆ వ్యాధి లక్షణాలు ఉన్న వారికి అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హమీదాబేగం, మెడికల్ ఆఫీసర్ ఎస్.కె.ఖాజామొహిద్దీన్, సీహెచ్ఓ మురళీకృష్ణ, అసిస్టెంట్ మలేరియా అధికారి వెంకటరెడ్డి, సబ్ యూనిట్ అధికారి సుబ్బరాయుడు, పీహెచ్ఎన్ లక్ష్మీదేవి, మాణిక్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ

కడప రూరల్: జిల్లాను కుష్టు రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఈ నెల 18వ తేదీ నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి నాగరాజు తెలిపారు. స్థానిక జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ మీటింగ్ హాలులో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మంగళవారం పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆశా వర్కర్లు, వలంటీర్లు, ఆరోగ్య కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి గృహాలను సందర్శించి ప్రతి ఒక్కరినీ పరీక్షించాలన్నారు. చేతులు, కాళ్లలో బొబ్బలు రావడం, వేళ్లు వంకర్లు తిరగడం వంటి లక్షణాలు ఉంటే కుష్టు అనుమానిత లక్షణంగా పరిగణలోకి తీసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా ఇమ్మునైజేషన్ అధికారి డాక్టర్ ఉమామహేశ్వర్, ఎయిడ్స్/టీబీ నివారణ అధికారి డాక్టర్ రవిబాబు, డెమో భారతి, తదితరులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరులో వైద్య కళాశాల ఏర్పాటుచేయాలి


తహసీల్దార్ విద్యాసాగర్‌కు వినతి పత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరులో వైద్య కళాశాల ఏర్పాటు చేయాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద మంగళవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.రామయ్య, ప్రాంతీయ కార్యదర్శి పి.సుబ్బరాయుడులు మాట్లాడుతూ 350 పడకల ప్రభుత్వ ఆస్పత్రిలో డాక్టర్లు, స్టాఫ్ నర్సులు, ఫార్మాసిస్టుల కొరత ఉందన్నారు. 30 పడకలకు ఒక ఫార్మాసిస్టు ఉండాల్సి ఉండగా నలుగురే ఉన్నారన్నారు. ఎఫ్ఎన్ఓ, ఎంఎన్ఓలను సంబంధం లేని విధులకు వినియోగిస్తున్నారని తెలిపారు. జిల్లా ఆస్పత్రిలో సుమారు 2 వేల వరకు ఓపీ ఉందని, 70 మంది ఇన్‌పేషెంట్లు వస్తున్నారని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఎమ్మెల్యే వరదరాజులు రెడ్డి జిల్లా ఆస్పత్రిని అన్ని సౌకర్యాలతో అభివృద్ధి చేయాలని వారు కోరారు. అనంతరం తహసీల్దారు విద్యాసాగర్‌కు వినతిపత్రం సమర్పించారు.

తల్లి మందలించిందనిని కుమార్తె ఆత్మహత్య

కడప అర్బన్ : తల్లి మందలించిందని ఇంట్లో ఎవరూ లేని సమయంలో కుమార్తె చీరతో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కడప నగరంలోని చిన్న చౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చంద్రమౌళీశ్వర్ నగర్‌లో నివాసముంటున్న మంజుల ఇంటింటికి వెళ్లి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. ప్రతి రోజూ మాదిరిగానే పనులకు వెళుతున్న సమయంలో కుటుంబ విషయమై తన కుమార్తె (15)ను మందలించి వెళ్లిపోయింది. మధ్యాహ్నం వచ్చి చూసేసరికి తన కుమార్తె ఫంకాకు ఉరి వేసుకుని విగత జీవిగా పడి ఉండడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. సంఘటన స్థలాన్ని చిన్నచౌక్ ఎస్ఐ పి. రవికుమార్ పరిశీలించి, మృతదేహాన్ని రిమ్స్‌కు పంపించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలియజేశారు.

వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడి మృతి


మాచునూరు చంద్రారెడ్డి (ఫైల్)

పెండ్లిమర్రి : పెండ్లిమర్రి మండల సీనియర్ నాయకుడు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మాచునూరు చంద్రారెడ్డి(76) మంగళవారం రాత్రి మృతిచెందాడు. చంద్రారెడ్డి అనారోగ్యంతో ఇటీవల హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ అసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మంగళవారం రాత్రి పల్స్ డౌన్ కావడంతో మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మాచునూరు సర్పంచ్‌గా సుదీర్ఘకాలం పనిచేసిన చంద్రారెడ్డి వైఎస్సార్‌సీపీ పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీకి మండల కన్వీనర్‌గా పనిచేస్తున్నారు. ఆయన తండ్రి మాచునూరు వీరారెడ్డి సమితి ప్రెసిడెంట్‌గా, కోడలు వరలక్ష్మి ఒకసారి జెడ్పీటీసీగా ప్రస్తుతం ఎంపీపీగా కొనసాగుతున్నది. మండల రాజకీయాల్లో చురుకైన పాత్ర నిర్వహించేవారు. జిల్లాలో మాచునూరు చంద్రారెడ్డిగా రాజకీయవేత్తలకు సుపరిచితుడు. ఆయన మృతితో ఆకుటుంబానికి, పార్టీకి తీరని లోటు ఏర్పడింది.

సౌత్ ఇండియా హాకీ పోటీలు

పులివెందుల టౌన్ : పులివెందుల పట్టణంలోని వైఎస్సార్ హాకీ క్రీడా మైదానంలో సౌత్ ఇండియా హాకీ చాంపియన్‌షిప్ హాకీ పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. మంగళ వారం కేరళ, పాండిచ్చేరి, తమిళనాడు, కర్ణాటక, ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాలకు సంబంధించిన బాలబాలికల జట్ల మధ్య పోటీలు కొనసాగాయి. కర్ణాటక జట్టు కేరళ జట్టుపై ఐదు గోల్స్, తెలంగాణా జట్టు పాంచ్చేరి జట్టుపై రెండు గోల్స్, ఆంధ్రప్రదేశ్ జట్టు తమిళ నాడు జట్టుపై ఆరు గోల్స్ వేసి విజయం సాధించాయి. అలాగే పురుషుల విభాగంలో తెలంగాణా జట్టు పాండిచ్చేరి జట్టుపై నాలుగు, కర్ణాటక జట్టు కేరళ జట్టుపై ఆరు, తమిళనాడు జట్టు ఆంధ్ర జట్టుపై మూడు గోల్స్ వేసి విజయకేతనం ఎగురవేశాయని టోర్నమెంట్ ఆర్గనైజింగ్ కార్యదర్శి చాణిక్య రాజ్ తెలిపారు.


హాకీ ఆడుతున్న బాలికల జట్టు

అండర్–19 వన్డే క్రికెట్ టోర్నీ ప్రారంభం


ఖాజామోహిద్దీన్ కృష్ణా (121 పరుగులు)


సుశాంత్ 121 పరుగులు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి–ఏసీఏ క్రికెట్ మైదానం, కేఎస్ఆర్ఎం, కేఓఆర్ఎం మైదానం వేదికగా ఏసీఏ అండర్–19 అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్ ఉత్సాహంగా ప్రారంభమైంది. వైఎస్ రాజారెడ్డి–ఏసీఏ మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో కడప, రెస్టాఫ్ సౌత్‌జోన్ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన సౌత్‌జోన్ జట్టు బ్యాటింగ్ ఎంచుకుని 37.1 ఓవర్లలో 133 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని మన్విత్‌రెడ్డి 36 పరుగులు చేశాడు. కడప బౌలర్లు ప్రణవ్‌రెడ్డి 4, ధీరజ్‌కుమార్‌రెడ్డి 3, ధర్మసేనారెడ్డి రెండు వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు 23.4 ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 134 పరుగులు చేసి విజయం సాధించింది. జట్టులో గురు విఘ్నేష్ 43 పరుగులు చేశాడు.

విశాఖ జట్టు విజయం..

కేఓఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో విశాఖపట్నం, రెస్టాఫ్ నార్త్‌జోన్ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన నార్త్‌జోన్ జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన విశాఖ జట్టు 50 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 273 పరుగులు చేసింది. జట్టు లోని ప్రసాద్ 54 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నార్త్‌జోన్ జట్టు 50 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 202 పరుగులు చేసింది. జట్టులో సుశాంత్ 121 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. విశాఖ బౌలర్లు రచిత్ 2, యువన్ 2 వికెట్లు తీశారు. దీంతో విశాఖపట్నం 71 పరుగుల తేడాతో విజయం సాధించింది.

సెంట్రల్‌జోన్ జట్టు గెలుపు..

కేఎస్ఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో కృష్ణా, రెస్టాఫ్ సెంట్రల్‌జోన్ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన సెంట్రల్ జోన్ జట్టు బ్యాటింగ్ ఎంచుకుని నిర్ణీత 50 ఓవర్లలో ఎనిమిది వికెట్ల నష్టానికి 310 పరుగులు చేసింది. జట్టులోని శ్రీనివాస్ 75 పరుగులు, రేవంత్ నాగకుమార్ 63 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కృష్ణా జట్టు 50 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 237 పరుగులు చేసింది. జట్టులోని ఖాజామోహియుద్దీన్ 121 పరుగులు చేశాడు. సెంట్రల్‌జోన్ బౌలర్లు ఆదిత్య 2, షేర్షా 2 వికెట్లు తీశారు. దీంతో సెంట్రల్‌జోన్ 73 పరుగుల తేడాతో విజయం సాధించింది.